నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

చేర్యాల(ధూల్మిట్ట),: ధూల్మిట్ట విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా ఈనెల 25న విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ధూల్మిట్ట మండల సహాయ ఇంజినీర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ధూల్మిట్ట, బెక్కల్, బైరాన్‌పల్లి గ్రామాల పరిధిలో సరఫరా పూర్తిగా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

26 మండలాలకు ఎంఈవోల నియామకం

సిద్దిపేట, న్యూస్‌టుడే: విద్యా వ్యవస్థలో పర్యవేక్షణ స్థాయి పెంచేందుకు కీలక ముందడుగు పడింది. జిల్లాలో 26 మండలాలకు ఎంఈవోలను (మండల విద్యాధికారులు) నియమిస్తూ మంగళవారం విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మండలాల వారీగా సీనియర్, గెజిటెడ్ హెచ్‌ఎంలకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు కేటాయించారు. ఇన్నాళ్లు 26 మండలాలకు ఎనిమిది మంది ఎంఈవోలుగా వ్యవహరించారు. తాజా చర్యలతో జిల్లా పరిధిలో ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలు, విద్యా శాఖ కార్యక్రమాలు ప్రభావవంతంగా నిర్వహించేందుకు ఆస్కారం కలుగుతుందని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

కట్టుదిట్టంగా ఓటరు నమోదు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఓటరు నమోదు కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి సుదర్శన్‌రెడ్డి.. జిల్లా అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల పాలనాధికారులతో దృశ్యసమీక్ష నిర్వహించారు. సిద్దిపేట సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పాలనాధికారి మనుచౌదరి, అదనపు పాలనాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు సదానందం, రామ్మూర్తి, ఏవో అబ్దుల్ రహమాన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నిధుల గలగల.. హుస్నాబాద్ కూడళ్ల కళకళ



హుస్నాబాద్‌లో ప్రస్తుత గాంధీ కూడలి



సుందరీకరిస్తే మారే తీరు

న్యూస్‌టుడే, హుస్నాబాద్: హుస్నాబాద్ పురపాలిక పరిధిలోని ప్రధాన కూడళ్ల సుందరీకరణతో రూపురేఖలు మారిపోనున్నాయి. గాంధీ చౌరస్తా, నాగారం రోడ్‌లోని కూడలి, కరీంనగర్‌రోడ్‌లో విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలోని వై జంక్షన్ల సుందరీకరణకు టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.2 కోట్లు మంజూరై టెండర్లు పూర్తయ్యాయి. ప్రైవేటు కన్సల్టెన్సీ ద్వారా కూడళ్ల సుందరీకరణ ఆకృతులను రూపొందించారు. సుందరీకరణపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు ఇస్తున్నారు. త్వరలోనే పనుల ప్రారంభానికి శంకుస్థాపన నిర్వహిస్తామని పురాధ్యక్షురాలు ఆకుల రజిత తెలిపారు.

సన్న ధాన్యం.. బోనస్ అభయం

- జిల్లాలో రూ.500 చొప్పున చెల్లించేది రూ.79.20 కోట్లు

సిద్దిపేట అర్బన్, సిద్దిపేట, గజ్వేల్, న్యూస్‌టుడే: సన్నరకం ధాన్యం పండించే రైతులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ధాన్యం(సన్నరకం) పండించే రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్‌ను అందజేయాలని ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ భేటీలో నిర్ణయించారు. ఇది వరకు అన్నదాతలు కొనుగోలు కేంద్రాల్లో కేవలం దొడ్డురకం ధాన్యాన్ని విక్రయించేవారు. ప్రస్తుత సీజన్‌లో సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారు.

కొన్ని మండలాల్లోనే..

జిల్లా వ్యాప్తంగా సిద్దిపేట, నంగునూరు, చిన్నకోడూరు, నారాయణరావుపేట, దుబ్బాక, కోహెడ, అక్కన్నపేట, కొండపాక మండలాల్లో వరి సాగైంది. వానకాలం సీజన్‌లో పంట సాగుపై అధికారుల అంచనాలు కొంత మేర తగ్గాయి. ప్రారంభ నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. సాగు విస్తీర్ణం తగ్గింది. ఈ నెల తొలి వారం వరకూ వరి నాట్లు పడ్డాయి.



బూరుగుపల్లిలో వరి పొలాలు

ఎకరాకు రూ.20 వేలకు పైగా ఖర్చు

ఒక ఎకరా పొలం నుంచి సాధారణంగా 24 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది. సన్న రకం వరి పంట సాగు చేసిన వారికి బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో క్వింటాలుకు రూ.500 చొప్పున చెల్లించనున్నారు. ఈ ప్రకారం జిల్లాలో 79.20 కోట్లు బోనస్‌గా అదనపు మొత్తం రైతులకు అందనుంది. వరి పంట సాగుకు ఒక ఎకరాకు ఇరవై వేల రూపాయలకు పైగా అవుతుంది. కుటుంబ సభ్యులే కలుపుతీత పనులు చేసుకుంటే ఖర్చు తగ్గుతుంది. కూలీలను పెట్టి కలుపు తీయిస్తే పెరుగుతుంది. ఏ గ్రేడ్ ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,320 ఉంది. సాధారణ రకానికి క్వింటాలుకు రూ.2,300 చెల్లిస్తారు. సన్న రకం ధాన్యం (ఏగ్రేడ్) బోనస్‌తో కలిపి క్వింటాలుకు రూ.2,820కి చేరనుంది.

ఒక ఎకరాకు సాధారణ ఖర్చు (రూ.లో)

దున్నకం - 8,400	విత్తనం - 1,200
నాటు - 5,000	దుక్కి మందు - 1,350
యూరియా, పొటాష్‌లాంటివి - 2,000	కోత - 2,500

కుటుంబ అవసరాలకే పండిస్తున్నాం..

సన్నరకం వరిని రైతులు వారి కుటుంబ అవసరాలకే ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఒకవేళ ఎవరైనా సన్నాలను విక్రయించాలనుకుంటే బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు ఎక్కువ ధరకు తీసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన బోనస్.. ఎక్కువ లాభదాయకం కాదు. వ్యాపారులు క్వింటాలుకు రూ.3,200 ఇచ్చి కొంటారు. కృష్ణారెడ్డి, రైతు, మద్రిముస్త్యాల

వరి సాగు తీరుతెన్నులు

వానకాలంలో అంచనా (ఎకరాల్లో)	4,00,000
వాస్తవంగా సాగైంది	3,68,000
దొడ్డు రకం వరి విస్తీర్ణం	3,02,000
సన్న రకం	66,000
సన్నాల దిగుబడి అంచనా (క్వింటాళ్లు)	15,84,000
ఏగ్రేడ్ ధాన్యం మద్దతు ధర (క్వింటాలుకు రూ.ల్లో)	2,320

రూ.500 బోనస్ ప్రకారం 'సన్నాల' రైతులకు వచ్చే అదనపు సొమ్ము (రూ.లో) -79,20,00,000

ఇక ఆటంకం లేని రాకపోకలు



సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాల ముందు గుంతలను అధికారులు తొలగించి రోడ్డు వేశారు. శౌచాలయాలకు వెళ్లే దారిలో బాలలకు ఇబ్బంది కలగకుండా మొక్కలను తీసేసి శుభ్రం చేశారు. గత నెల 9న 'ఈనాడు'లో బడి విద్యార్థుల రాకపోకలకు కలుగుతున్న ఇబ్బందులపై 'బూరుగుపల్లి బడి.. సౌకర్యాల్లో తడబడి' శీర్షికతో ఫొటోల కథనం ప్రచురితమైంది. దీనికి నిర్వాహకులు, అధికారులు స్పందించి పరిష్కరించారు. – న్యూస్‌టుడే, సిద్దిపేట అర్బన్

ఈనాడు కథనానికి స్పందన

వాన నీటిలో వంటిమామిడి బందీ!



జిల్లాలోని అనేక ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. ములుగు, మర్కుక్ మండలాల్లో ఏకధాటిగా కురవడంతో వంటిమామిడి కూరగాయల మార్కెట్ అంతా జలమయమైంది. రైతులు విక్రయించడానికి తీసుకొచ్చిన పంట ఉత్పత్తులన్నీ తడిసి ముద్దయ్యాయి. క్రయవిక్రయాలకు తీవ్ర అంతరాయం కలిగింది. తెచ్చిన కూరగాయలను రాత్రి మార్కెట్లోనే భద్రపరిచారు. – న్యూస్‌టుడే, ములుగు

పండు కావాలా నాయనా!



శిరస్త్రాణం ధరించకుండా ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదారులకు జరిమానా వేయడం సర్వసాధారణం. చేర్యాల పోలీసులు వినూత్న రీతిలో కార్యక్రమాన్ని చేపట్టారు. వాహనదారులను ఆలోచింపచేశారు. సీఐ ఎల్.శ్రీను, ఎస్సై నీరేశ్, సిబ్బంది మంగళవారం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. శిరస్త్రాణం ధరించిన వారికి ప్రోత్సాహకంగా ఆపిల్ పండును అందజేశారు. వాటిని ధరించకుండా వెళ్తున్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. విలువ కట్టలేని ప్రాణాన్ని శిరస్త్రాణం కాపాడుతుందని చెప్పారు. వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు.– న్యూస్‌టుడే, చేర్యాల

ప్రజలకు రక్షణ కల్పించడమే కర్తవ్యం

సిద్దిపేట టౌన్, చిన్నకోడూరు, నంగునూరు, న్యూస్‌టుడే: ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని సిద్దిపేట (పోలీసు కమిషనర్) సీపీ అనురాధ సూచించారు. చిన్నకోడూరు, రాజగోపాల్‌పేట ఠాణాలను సిద్దిపేట ఏసీపీ మధుతో కలిసి మంగళవారం సందర్శించి పలు సూచనలు చేశారు. సీపీ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. సిద్దిపేట గ్రామీణ సీఐ శ్రీను, ఎస్‌ఐలు ఉన్నారు. కోర్టులో విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందితో పోలీస్ కమిషనరేట్‌లో సమీక్షా సమావేశాన్ని సీపీ నిర్వహించారు. కక్షిదారులు రాజీ పడేలా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను కూడా త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సాక్షులకు అవగాహన కల్పించాలన్నారు. కేసుల్లో శిక్షల శాతం పెంచాలని సూచించారు.



చిన్నకోడూరు ఠాణాలో మొక్క నాటి ట్రీగార్డు ఏర్పాటు చేస్తున్న సీపీ అనురాధ, సిబ్బంది

అక్కన్నపేటలో 80 ఎకరాల పారిశ్రామిక పార్కు

మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట, హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుస్నాబాద్ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు చేపట్టామని, ఈ నేపథ్యంలోనే అక్కన్నపేటలో ఏర్పాటు చేయనున్న టీజీఐఐసీ పారిశ్రామిక పార్కులో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు స్థాపనకు ముందుకు రావాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేటలోని కలెక్టరేట్‌లో టీజీఐఐసీ అధికారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. త్వరలోనే రూ.170 కోట్లతో హుస్నాబాద్-కరీంనగర్, హుస్నాబాద్-జనగామ నాలుగు వరుసల రహదారులు నిర్మాణం చేపడతామన్నారు. వర్గల్ పారిశ్రామిక పార్కులో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కలెక్టర్ మనుచౌదరి, టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పవన్‌కుమార్ మాట్లాడారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు సదానందం, రామ్మూర్తి, జిల్లా పరిశ్రమల అధికారి గణేశ్‌రాం, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

- హుస్నాబాద్‌లో కబడ్డీ కోర్టును మంత్రి ప్రారంభించారు. క్రీడాకారులతో కలసి షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు.
- ఆదర్శ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని, గిరిజన బాలికల వసతి గృహాన్ని సందర్శించారు.
- ఎల్లమ్మ చెరువులో వ్యర్థాల తొలగింపు 'స్వచ్ఛతా హీ సేవ'లో మంత్రితో పాటు పురపాలిక అధ్యక్షురాలు ఆకుల రజిత, ఉపాధ్యక్షురాలు అనిత, కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, ఆర్డీఓ రామమూర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అక్టోబరు 2 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.
- గౌరవెల్లి రిజర్వాయర్ పరిసరాలను పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి పరచాలని గ్రామస్థులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.
- హుస్నాబాద్‌లో కరీంనగర్‌రోడ్‌లో విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలో తెలంగాణ ఉద్యమనేత మాజీ మంత్రి కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం ఏర్పాటు పద్మశాలి సంఘం నాయకులు ప్రతిపాదించిన స్థలాన్ని మంత్రి పరిశీలించారు.
- అక్కన్నపేట, చౌటపల్లి, అంతకపేట, కన్నారం, గొల్లకుంట గ్రామాల్లో పలువురు మృతుల కుటుంబాలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మంత్రి పరామర్శించారు.
- పంతులుతండా, పిక్కుతండా, చెరువుకొమ్ముతండా, ధరావత్‌తండాలకు తారు రోడ్డు నిర్మించాలని భాజపా నాయకుడు రైనా నాయక్ మంత్రికి వినతిపత్రం సమర్పించారు.
- హుస్నాబాద్‌లో ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహం ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ విన్నవించారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో కలెక్టర్ మనుచౌదరి, అధికారులు

దరఖాస్తులు 5488.. తిరస్కరణ 100

హుస్నాబాద్ చెరువు, కుంటల శిఖంలోని 'క్రమబద్ధీకరణ' స్థలాలపై చర్య

న్యూస్‌టుడే, హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధిలో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి వాటిని క్రమబద్ధీకరణకు చేసుకున్న దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఈ స్థలాల్లో వ్యవసాయేతర పనులు చేపట్టడానికి వీలు లేదనే నిబంధన ఉన్నప్పటికి అప్పట్లో కొందరు స్థిరాస్థి వ్యాపారులు స్థలాలను ప్లాట్లుగా చేసి విక్రయించారు. ఐదారేళ్ల క్రితం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న వాటిని వివిధ గ్రామాలకు చెందిన వారు కొనుగోలు చేశారు. రెండేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఉన్న స్థలాలను కొనుగోలు చేసిన వారు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు.



పట్టణంలో ఎఫ్‌టీఎల్ పరిధి స్థలాలివి

భవిష్యత్తులోనూ అవకాశం లేనట్టే..

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించింది. హుస్నాబాద్ పురపాలికలో 5488 దరఖాస్తులు రాగా వాటి పరిశీలన జరుగుతోంది. ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తుల పరిశీలనతో పాటు ఆమోదం, తిరస్కరణ పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని, దరఖాస్తులో సూచించిన స్థలం ప్రభుత్వ భూమి, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉందా అనే విషయాన్ని ఆయా శాఖల అధికారులు చూసి వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. దాదాపు వందకు పైగా ఇళ్ల స్థలాల దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. భవిష్యత్తులోనూ ఎల్‌ఆర్‌ఎస్ ఆమోదం లభించే అవకాశం లేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నామని.. చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తులను తిరస్కరించామని కమిషనర్ మల్లికార్జునగౌడ్ తెలిపారు.

పరిహారం కిరికిరి.. పరిష్కరించాలి మరి



రైతులకు ఇచ్చేందుకు సిద్ధం చేసిన ఇంటి స్థలాలు


న్యూస్‌టుడే, వర్గల్: పచ్చని పొలాలు తీసుకుని రైతులను కూలీలుగా మార్చిన గత ప్రభుత్వం ఇప్పటికీ సరైన పరిహారం, ఇస్తామన్న ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడంతో రోడ్డున పడ్డామని రైతులు ఆందోళన చేస్తున్నారు. వర్గల్ మండలంలో 2000 సంవత్సరంలో పరిశ్రమల ఏర్పాటుకు రైతుల నుంచి భూమిని సేకరించారు. అవుసులోనిపల్లి, చౌదరిపల్లి, మల్లారెడ్డిపల్లి, నగరంతండా, రామక్కపేట గ్రామాలలో 292 మంది రైతుల నుంచి 1495, 1510 సర్వే నెంబర్లలో 783 ఎకరాలు భూమిని సేకరించారు. ఎకరాకు 10 లక్షల చొప్పున పరిహారం అందించినట్లు అధికారులు చెబుతున్నారు. పరిహారం రాలేదని తమకు కేటాయిస్తామన్న ఇళ్ల స్థలాలు ఇంతవరకు కబ్జా చూపలేదని కొన్ని రోజులుగా నిర్వాసితులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీల పనులు కొనసాగకుండా నిలుపుతున్నారు. రైతులకు 40 ఎకరాల భూమిలో 292 మంది రైతులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రోడ్లు వేశారు. ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఎక్కువ భూమి కోల్పోయిన రైతులకు 250 గజాలు తక్కువ భూమి కోల్పోయిన వారికి 120 గజాల చొప్పున స్థలాల పట్టాలు ఇచ్చారు. ఏ స్థలం ఎవరిదో చెప్పలేదు.

నిలిపి, సాగు చేసుకుంటున్న: కుమ్మరి నర్సింలు, వర్గల్



నాకు రెండెకరాల భూమి ఉంది. పరిశ్రమల కోసం తీసుకున్నామని చెప్పారు. ఒక్క రూపాయైనా పరిహారం ఇవ్వలేదు. ఇంటి స్థలం పట్టా ఇవ్వలేదు. మా భూమిలో రోడ్డు నిర్మిస్తామంటే పనిని నిలిపేసిన. నేను సాగు చేసుకుంటున్న. పరిహారం, స్థలం ఇచ్చిన తర్వాతే పనులు చేయాలంటున్న.

9 ఉంటే 6 ఎకరాలకే..: తీగుల్ల రాములు



నేను తొమ్మిది ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నా. పరిహారం 6 ఎకరాలకు మాత్రమే అందింది. మిగిలిన భూమికి పరిహారం ఇవ్వమంటే ఇంతవరకు ఇవ్వలేదు. వేరే రైతులకు కబ్జాలో ఎంత ఉంటే అంత పరిహారం ఇచ్చారు. నాకు పూర్తిగా రావాలి.

ఉత్తీర్ణత శాతం పెరిగేలా కృషి చేయాలి: డీఐఈవో

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రానికి తలమానికంగా ఉన్న గజ్వేల్ బాలుర విద్యాసౌధంలో ఉత్తీర్ణత శాతం పెరిగేలా కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈవో) రవీందర్ రెడ్డి సూచించారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని బాలుర విద్యాసౌధం ప్రాంగణంలోని జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కళాశాలలో రికార్డులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరేలా అధ్యాపకులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ స్థాయికి దీటుగా విద్యాబోధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రవీందర్ రెడ్డి

రుణాలతో స్వయం సమృద్ధి సాధన

తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: స్వశక్తి మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకు లింకేజీ రుణాలతో స్వయం సమృద్ధి సాధించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ బాలనాగు అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లో ఐకేపీ కార్యాలయంలో బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీలో పాల్గొన్నారు. హుస్నాబాద్, అక్కన్నపేట, కట్కూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకుల పరిధిలోని 32 స్వశక్తి సంఘాలకు రూ.6 కోట్ల రుణాలు పంపిణీ చేసి మాట్లాడారు. స్వయం ఉపాధి కల్పించే వివిధ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు మహిళలు ముందుకు రావాలన్నారు. స్వచ్ఛతా హి సేవాలో భాగంగా మొక్కలు నాటారు. చీఫ్ మేనేజర్ గిరిమోజు నాయక్, మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న బాలనాగు

వరకట్న వేధింపులకు వివాహిత బలి

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా విషాదం నింపింది. ఒకటో ఠాణా సీఐ కోటేశ్వర్ కథనం ప్రకారం.. బెజ్జంకి మండలానికి చెందిన శ్రావణి (22)కి ఎల్‌ఎండీ కాలనీకి చెందిన దొంత అజయ్‌కుమార్‌కు ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహం జరిగింది. వీరు కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌లో అద్దెకు ఉంటున్నారు. అదనపు కట్నం తేవాలంటూ కొంతకాలంగా అత్తింటి నుంచి వేధింపులు మొదలయ్యాయి. ఈ క్రమంలో తీవ్ర మానసిక వేదనకు గురైన శ్రావణి.. మంగళవారం అద్దె ఇంట్లో ఉరేసుకుంది. ఈ మేరకు మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.




శ్రావణి

పట్టణ వనిత.. పొదుపుతో ప్రగతి బాట

వచ్చే నెల 15లోపు సభ్యులను చేర్పించేందుకు కార్యాచరణ

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ: మహిళలు పొదుపు బాట పట్టి కుటుంబానికి అండగా నిలిస్తే ఆనందమే వేరు. పట్టణ మహిళల పొదుపు సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. పట్టణాల పొదుపు సంఘాల్లో మహిళలు ఎక్కువ సంఖ్యలో చేరడం లేదు. పురపాలికల్లో వార్డుల వారీగా సర్వే చేసి కొత్త సభ్యులను చేర్చుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఆర్థికంగా ఎదిగేలా కృషి చేసేందుకు మెప్మా కృషి చేస్తోంది. అర్హులైన ప్రతి మహిళకు సభ్యత్వం ఉండేలా చూడాలంటూ ఉన్నతాధికారులు గతంలో ఆదేశాలు జారీ చేయడంతో ఈ చర్యలు తీసుకుంటున్నారు.



గజ్వేల్: సమావేశమైన మహిళా సంఘం సభ్యులు

కారణాలపై ఆరా: జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, చేర్యాల ఐదు పురపాలికల్లో 115 వార్డులున్నాయి. మెప్మా ఆధ్వర్యంలో ఆర్పీలు, సీవోలు విధులు నిర్వహిస్తున్నారు. వీరిపై పర్యవేక్షణకు జిల్లా మెప్మా సమన్వయకర్త ఉంటారు. ప్రస్తుతం వార్డుకు ఒకరు చొప్పున ఆర్పీని నియమించారు. వారితోనే క్షేత్రస్థాయిలో సభ్యులను చేర్పిస్తున్నారు. ఇంటింటికీ సిబ్బంది వచ్చి సర్వే చేపడతారు. స్వయం సహాయక సంఘాల్లో చేరని వారి వివరాలు సేకరిస్తారు. పొదుపు సంఘాల్లో చేరకపోవడానికి కారణాలు తెలుసుకోనున్నారు.

జిల్లాలో మహిళ సంఘం సభ్యులు

పురపాలిక	గ్రూపులు	సభ్యులు
సిద్దిపేట	2165	22071
గజ్వేల్-ప్రజ్ఞాపూర్	641	6554
దుబ్బాక	570	6082
హుస్నాబాద్	485	5144
చేర్యాల	305	3213
మొత్తం	4166	43064

ఇది సదవకాశం: హనుమంతరెడ్డి, మెప్మా పీడీ

ప్రత్యేక కార్యాచరణ రూపొందించి సంఘాల ఏర్పాటు ప్రక్రియ జిల్లాలో చురుగ్గా సాగుతోంది. వచ్చేనెల 15 వరకు ఉంటుంది. ఇది సదవకాశం. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.పది వేల ప్రోత్సాహక రుణం అందుతుంది. ఇది తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదు.

నాచగిరి హుండీ ఆదాయం రూ.11.83 లక్షలు


కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

వర్గల్, న్యూస్‌టుడే: ప్రసిద్ధ నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గడిచిన 75 రోజులకు రూ.11,83,932 వచ్చినట్లు ఈవో అన్నపూర్ణ పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సాయంత్రం వరకు లెక్కింపు జరిగింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు, గౌరారం పోలీసులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు


మాట్లాడుతున్న వీరశెట్టి

టేక్మాల్, న్యూస్‌టుడే: చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని స్వయం శక్తి అగ్రి ఫౌండేషన్ ఛైర్మన్(మిలెట్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ) వీరశెట్టి పేర్కొన్నారు. టేక్మాల్ మండల పరిధిలోని పల్వంచలోని రైతులకు మంగళవారం టేక్మాల్ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పల్వంచ, బొడ్మట్‌పల్లి గ్రామాల్లో కొర్ర సాగుదారు సేకరించిన ధాన్యాన్ని తీసుకొచ్చి యంత్రంలో నూర్పిడి చేశారు. పలు ధాన్యాల రకాలతో చేసే ఆహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంఘం ఛైర్మన్ మొగులయ్య, సీఈవో వెంకటేశం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అనంతగిరి.. ఆహ్లాద సిరి!

న్యూస్‌టుడే, వికారాబాద్ మున్సిపాలిటీ, వికారాబాద్ గ్రామీణ

ఎటూ చూసినా పచ్చదనం, కొండలు.. మూసీ నది పరవళ్లు.. మధ్యలో ఆలయం.. ఇవీ అనంతగిరి విశేషాలు. జిల్లా కేంద్రం వికారాబాద్‌కు 6 కి.మీ. దూరంలోని అనంతగిరి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తోంది. అటవీ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) ఇందుకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వ ఆమోదానికి పంపించింది. పచ్చజెండా ఊపడమే ఆలస్యం. మరోవైపు కేంద్రం స్వదేశీ అభియాన్ పథకం కింద కేంద్రం రూ.100 కోట్లు మంజూరు చేసింది. తొలి దశలో రూ.38 కోట్లు వచ్చాయి. పనులు ప్రారంభించాల్సి ఉంది.


అనంతగిరి అడవిలో పర్యాటకులు

అభివృద్ధి ఇలా..

● అనంతగిరి కొండల్లో పర్యటకులు బస చేసేందుకు నాలుగు కాటేజీలను ఆధునికీకరిస్తారు.


గ్రాస్‌ల్యాండ్ ప్రాంతం ఇదే..

డైనింగ్ హాల్ నిర్మించనున్నారు.

● ఇక్కడి గ్రాస్‌ల్యాండ్‌లో పర్యటించేందుకు సఫారీ వాహనం సమకూర్చారు. అక్కడే ఆల్పాహారం, ఆ తర్వాత ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిస్తూ..

– జ్ఞానేశ్వర్, డీఎఫ్‌వో, వికారాబాద్



అనంతగిరి కొండలపై పర్యావరణం దెబ్బతినకుండా అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. స్వదేశీ అభియాన్ పథకం కింద కేంద్రం అనంతగిరి కొండలను, భువనగిరిని ఎంపిక చేసింది. పర్యాటకానికి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. అనంతగిరికి రూ.100 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులను రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధి సంస్థ పర్యవేక్షిస్తుంది. అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోనూ పలు అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి.

80 హెక్టార్లలో అభివృద్ధి..

ప్రతి శని, ఆదివారాల్లో సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుంది. హైదరాబాద్, ఇతర జిల్లాల నుంచి పర్యటకులు వస్తుంటారు. ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి పనులు పూర్తయి అందుబాటులోకి వస్తే పర్యటకుల సంఖ్య మరింత పెరగడం ఖాయం. ఈ మేర అటవీ శాఖకు ఆదాయం సైతం పెరగనుంది. వసతుల కల్పనకు నందిఘాట్ సమీపంలో 80 హెక్టార్లను గుర్తించారు. ఇక్కడే ఎబ్బనూరు చెరువు ప్రాంతం వరకు అభివృద్ధికి ప్రతిపాదించారు.

● ఔషధ మొక్కలపై అవగాహన కల్పనకు ప్రత్యేక ప్రాజెక్టును సిద్ధం చేస్తున్నారు.

● ట్రీ హౌస్‌లు, టెంట్లలో సందర్శకులు బస చేసేలా సౌకర్యాలు కల్పించనున్నారు. ఇందుకు రెండు, మూడెకరాలలో వసతులు కల్పిస్తారు.

ప్రత్యేకతలు ఇవీ

● 3800 ఎకరాల్లో అనంతగిరి కొండలు విస్తరించాయి. సముద్ర మట్టానికి 600 అడుగుల ఎత్తులో ఈ ప్రాంతం ఉంది.

● అనంత పద్మనాభ స్వామి కొలువయ్యాడు.

● వెయ్యి ఎకరాల్లో 508 కంటే ఎక్కువ ఔషధ మొక్కలు ఇక్కడ ఉన్నాయి.

● 1946లో క్షయ వ్యాధి నివారణ చికిత్సాలయాన్ని నెలకొల్పారు. ప్రస్తుతం ఇందులోనే ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటైంది.

బహిష్కరణ బాధితులకు అండగా అధికారులు

మనోహరాబాద్, న్యూస్‌టుడే: మండలంలోని గౌతోజిగూడెంలో ఓ కుటుంబాన్ని ఈ నెల 10న గ్రామపెద్దలు కుల బహిష్కరించడంపై బాధితుల ఫిర్యాదు మేరకు మనోహరాబాద్ పోలీసులు 31 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు 16 మందిని అదుపులోకి తీసుకోగా, 15 మంది పరారీలో ఉన్నారు. ఈ ఘటనపై జిల్లా బాధితులు హైకోర్టును ఆశ్రయించగా, చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామంలో కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. బాధిత కుటుంబంపై వివక్ష చూపకుండా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బాధితుడి కూతురు పాఠశాల బస్సులో వెళ్లేప్పుడు ఎవరూ మాట్లాడకపోవడం, ఇంటి వద్ద తోటివారు ఆడుకోకపోవడం వంటి ఘటనలతో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు అవగాహన కల్పిస్తున్నారు. కిరాణా దుకాణంలో సామగ్రి ఇవ్వడం లేదని తెలపడంతో, ఆలాంటివి జరగకుండా వ్యాపారులకు ప్రత్యేక సూచనలు చేశారు. బాధితులు చంద్రం, అర్జున్, నర్సమ్మ కుటుంబ సభ్యులకు పోలీసులు అండగా నిలిచారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో మనోహరాబాద్ ఎస్సై సుభాష్‌గౌడ్, పోలీసులు ఎప్పటికప్పుడు వారి యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు.

వర్గల్ నవోదయకు 'పీఎంశ్రీ' హోదా

వర్గల్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయానికి పీఎంశ్రీ హోదా దక్కినట్లు ప్రిన్సిపల్ రాజేందర్ పేర్కొన్నారు. పీఎంశ్రీ పథకం ప్రకారం నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం. ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల నుంచి నిధులు సమకూరుతాయని అవసరమైన మౌలిక వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 14 వేల పాఠశాలలు ఎంపిక కాగా అందులో రెండో విడతలో వర్గల్ నవోదయ ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు.

సింగూరు నీటి రాక.. ఆలయం మూసివేత



సింగూరు ప్రాజెక్టు నుంచి సోమవారం దిగువకు నీటిని విడుదల చేయడంతో మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ ఏడుపాయల వనదుర్గామాత ఆలయం ఎదుట మంగళవారం వరద ప్రవాహం పెరిగింది. దీంతో తెల్లవారుజామున అర్చకులు మాత్రమే గర్భగుడిలోకి వెళ్లి అమ్మవారికి అభిషేకం చేపట్టి నామార్చన చేపట్టి మూసివేశారు. భక్తులను అనుమతించలేదు. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు కొనసాగించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వరద ప్రవాహం తగ్గితే బుధవారం ఆలయం తెరిచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 11,000 క్యూసెక్కుల వరద దిగువకు ప్రవహిస్తోంది. - న్యూస్‌టుడే, పాపన్నపేట

క్రీడల్లో ప్రతిభ చూపితే పారితోషికాలు: మంత్రి

హుస్నాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ప్రభుత్వం తరఫున పారితోషికాలు అందించి ప్రోత్సహిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మినీ స్టేడియాన్ని ఆయన సందర్శించారు. స్థానిక ఎల్లమ్మ చెరువులో ఐకేపీ నిమజ్జనోత్సవంలో ఆనంతరం చేరిన వ్యర్థాలను మంత్రి, అధికారులు, ప్రజాప్రతినిధులు తొలగించే పనిని చేపట్టారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మినీ స్టేడియంలో క్రీడాకారులతో కలిసి 'స్వచ్ఛతా హీ సేవ' ప్రతిజ్ఞ చేయించారు. వారితో మంత్రి మాట్లాడుతూ.. క్రీడా సౌకర్యాలను విద్యార్థులు, ఆటగాళ్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


ఎల్లమ్మ చెరువులో వ్యర్థాలను తొలగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పురపాలకపోరుల రజిత, ఆర్డీవో రామ్మూర్తి

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి

మెదక్ టౌన్: ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సీజనల్ వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవనంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రుల్లో సరిపడా వైద్యులను నియమించడంతో పాటు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దేవయ్య, మల్లేశం, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకొచ్చి.. నీటిని పారించుకొని..


పూడిక తొలగిస్తున్న రైతులు



ఎవరైనా వచ్చి ఏదైనా చేస్తారని ఎదురుచూడలేదు ఆ రైతులు. స్వయంగా తమ సమస్యను పరిష్కరించుకొని సాగునీటికి ఢోకా లేకుండా చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలో నల్లవాగు పారుతోంది. వాగుపై జలాశయం నిర్మించారు. ప్రధాన కాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీ-4 నుంచి వెళ్లే కాలువ ద్వారా బీబీపేట, వెంకటాపూర్ గ్రామాల మీదుగా మార్డి వరకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇక్కడి వరకు కుడి కాలువ నిర్మించగా.. బీబీపేట వరకు బాగుంది. ఆ తర్వాత పూడిక పేరుకుపోయి, కాలువ అధ్వానంగా మారడంతో వరద పారని పరిస్థితి. వంతెకరాలో.. మార్డి గ్రామ పరిధిలో వందెకరాలలో వరి సాగు బోరుబావుల కింద వందెకరాలలో వరి సాగు చేశారు. ప్రస్తుతం పొట్ట దశలో ఉండగా, బోరుబావుల్లో నీటి మట్టాలు తగ్గడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో ఇక్కడి రైతులు ముందుకొచ్చి సాగునీటి సమస్య పరిష్కారానికి పూనుకున్నారు. రూ.1.50 లక్షలు పోగు చేసుకొని 3 కి.మీ. మేర పూడిక తొలగించుకొని కాలువను బాగు చేసుకున్నారు. ఇందుకు రెండు రోజులు శ్రమించారు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేకుండా కాలువ ద్వారా పొలాలకు నీరందుతోంది. ప్రతి ఏటా నీరు విడుదలకు ముందు నీటిపారుదల శాఖ సిబ్బంది కాలువల్లో పూడిక తొలగించేవారు. ఈ సారి చర్యలు తీసుకోకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా ముందుకురావడం విశేషం. – న్యూస్‌టుడే, కల్హేర్

చేనేతలో స్వయం ఉపాధికి 'సమర్థ' పథకం


యువతికి పుస్తకాలు, సామగ్రి అందజేస్తున్న చేనేత సేవా కేంద్రం హైదరాబాద్ ఏడీ పుహాలేంది

దుబ్బాక, న్యూస్‌టుడే: చేనేత రంగంలో యువతి, యువకులకు నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణ ఇవ్వడం ద్వారా స్వయం ఉపాధి సామర్థ్యంతో పాటు ఆర్థిక స్వావలంబన పెంపొందించే దిశగా సమర్థ పథకం ఎంతగానో దోహదపడుతుందని చేనేత సేవా కేంద్రం హైదరాబాద్ ఏడీ ఎస్.పుహాలేంది అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని చేనేత సహకార సొసైటీ లిమిటెడ్, దుబ్బాక హ్యాండ్లూమ్స్, హ్యాండ్ క్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌లలో యువతకు 45 రోజుల సమర్థ పథకం శిక్షణను ఆయన ప్రారంభించారు. శిక్షణకు ఉపయోగపడే సామగ్రిని అందించారు. ఆయన మాట్లాడుతూ.. చేనేత రంగంలో ఆసక్తితో యువత నేటి సాంకేతికతను అందిపుచ్చుకొని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి లభిస్తుందన్నారు. ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు గాజుల భాస్కర్, బోడ శ్రీనివాస్, అధికారులు పవన్ కుమార్, బాలాజీ, సంతోష్‌కుమార్, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జట్టుతో నిర్వాహకులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు 40 మంది క్రీడాకారులను ఎంపికచేశారు. మంగళవారం మెదక్‌లోని వెస్లీ పాఠశాల మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-17 విభాగంలో బాల, బాలికలకు వేర్వేరుగా ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి బాలురు-161, బాలికలు-86 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన 40 మందిని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. అక్టోబరు 3 నుంచి 5 వరకు మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయని, ఈ పోటీల్లో సదరు జట్టు పాల్గొనుందని ఎస్‌జీఎఫ్ మెదక్ జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. నిర్వాహకులు నాగరాజు, పీఈటీలు రూపేందర్, సుజాత, శ్రీనివాసరావు, మాధవరెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు, ఉద్యోగుల గొంతుకనవుతా..


మాట్లాడుతున్న డా.నరేందర్‌రెడ్డి తదితరులు

మెదక్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల సాధనకు చట్టసభలో వారి గొంతుకనై పనిచేస్తానని కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయాలనుకుంటున్న ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మెదక్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగాల రాక, జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయారని అన్నారు. ఉద్యోగుల బకాయి బిల్లులు, డీఏ, ఇంక్రిమెంట్ల సాధన, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసే వారికి ఆరోగ్యకార్డులు, పీజు రియింబర్స్‌మెంట్ సకాలంలో అందించేలా కృషి చేస్తానన్నారు. నూతన విద్యా పాలసీ తీసుకొస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, దీనివల్ల ఇంటర్, పదో తరగతి బోర్డులు ఉంటాయా? లేదా? అనే సందేహాలు కలుగుతున్నాయని అన్నారు. దీనిపై ప్రభుత్వంతో చర్చించేందుకు, సమస్యల పరిష్కారానికి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీగా గెలిచాక సేవకుడిగా ఉంటానని, వేతనాన్ని పేద విద్యార్థులు, నిరుద్యోగ సంక్షేమనిధి ఏర్పాటు చేసి కేటాయిస్తానని తెలిపారు. ప్రస్తుతం పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. స్నేహ విద్యాసంస్థల బాధ్యులు సత్యనారాయణ, బాధ్యుల పద్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


చిన్నచెల్మెడ అంగన్‌వాడీ కేంద్రం వద్ద బృందం సభ్యులు

ఐసీడీఎస్ కేంద్ర బృందం పర్యటన

మునిపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధి పెద్దచెల్మెడ, చిన్నచెల్మెడ అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ కేంద్ర బృందం అధికారులు పరిశీలించారు. మంగళవారం రూర్కెల్, బీహార్, ఉత్తరాఖండ్, ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన పలువురు అధికారులు బృందంగా ఆయా గ్రామాల్లో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలు, అభివృద్ధిపై తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న పౌష్టికాహారం తదితర అంశాలపై టీచర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీచర్లు రేణుక, మీనాక్షి ఉన్నారు.

అద్దెకు ఇల్లు కావాలని వచ్చి.. వృద్ధురాలి గొలుసు చోరీ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: వృద్ధురాలిని మాటల్లో పెట్టి ఆగంతకుడు గొలుసు లాక్కెళ్లిన ఘటన సిద్దిపేటలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు, తెలిపిన వివరాలు.. పట్టణంలోని మాజీ సర్పంచి కోరే ఎల్లయ్య తల్లి సత్తవ్వ (70) మంగళవారం ఇంట్లో కూర్చుని ఉండగా గుర్తు తెలియని యువకుడు వచ్చి ఇల్లు అద్దెకు ఉందా.. అని అడిగాడు. ఆమె లేదని చెప్పడంతో తాగేందుకు మంచినీళ్లు ఇవ్వాలని కోరాడు. ఆమె తెచ్చిచ్చిన నీళ్లు తాగి వెళ్లబోతూ ఒక్క ఉదుటున వృద్ధురాలిపై దాడి చేసి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కొని బయట నుంచి తలుపు గడియ పెట్టి పరారయ్యాడు. ఆమె కేకలకు కుటుంబ సభ్యులు వచ్చి చూసే సరికి దుండగుడు పరారయ్యాడు. కుమారుడు ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ చెప్పారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం


తిరుపతి

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామ పరిధి జాలుబాయితండా సమీపంలో విద్యుదాఘాతంతో గుగులోతు తిరుపతి(25) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. దూళ్మిట్ట మండలం కొండాపూర్ పరిధి జలాతాలతండాకు చెందిన తిరుపతి పరిసర గ్రామాల్లో ప్రైవేటుగా ఎలక్ట్రీషియన్ పని చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. మంగళవారం సాయంత్రం నియంత్రిక ఏబీ స్విచ్ ఆఫ్ సరఫరా నిలిపివేసేందుకు యత్నించాడు. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడిని నియంత్రిక వద్దకు ఎవరు పంపారనేది తెలియాల్సి ఉంది. ఎస్సై విజయభాస్కర్ ఘటనా స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. కేసు నమోదైంది. తిరుపతికి వచ్చే నెలలో నిశ్చితార్థం జరగాల్సి ఉంది.

బోరు వద్ద పొదలు తొలగిస్తుండగా వృద్ధుడు..


అంజయ్య


దుబ్బాక: పొలంలోని బోరు వద్ద ఉన్న పొదలను తొలగిస్తుండగా విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్సై వి.గంగరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని రఘోత్తంపల్లికి చెందిన గొరి అంజయ్య (71), ఎల్లవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయమే జీవనాధారం. పిల్లలందరికి వివాహాలు అయ్యాయి. సోమవారం రాత్రి పొలం వద్ద మొక్కలు తొలగించేందుకు కొడవలితో కొట్టుండగా ప్రమాదం జరిగింది. కుమారుడు గుర్తించి పరిశీలించగా అంజయ్య అప్పటికే మృతి చెందాడు. కుమారుడు నరేశ్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి


అలీ రెహమాన్

యాలాల: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు వికారాబాద్ జిల్లా యాలాల ఎస్సై శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. యాలాల చెందిన అలీ రెహమాన్ (38), పర్వీన్‌బేగం దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. అలీ రెహమాన్ సామాజిక కార్యకర్తగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భార్య కాలనీలో విడివిడిగా ఉంటున్నారు. మూడు రోజుల క్రితం రెహమాన్ ఇంటికి తాళం వేసుకొని నిద్రించాడు. మంగళవారం సాయంత్రం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. అలీ రెహమాన్ విగతజీవిగా పడి ఉన్నాడు. భార్య పర్వీన్ బేగం ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చెరువులో పడి వృద్ధుడు..


భూమయ్య

హవేలిఘనపూర్: ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతి చెందాడు. మెదక్ జిల్లా హవేలిఘనపూర్ ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. మండలంలోని బూర్గుపల్లికి చెందిన గుండె మొల్ల భూమయ్య (70) కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ శివారులో ఉన్న శ్రీపతి చెరువు వద్దకు వెళ్లాడు. కాలుజారి చెరువులో పడి ఊపిరాడక మృతి చెందాడు. భూమయ్య ఇంటికి రాకపోవడంతో గ్రామ శివారులో వెతకగా చెరువు వద్ద భూమయ్య చేతి కర్ర, చెప్పులు కనిపించాయి. ఈతగాళ్ల సాయంతో చెరువులో గాలించగా మృతదేహం లభించింది. భూమయ్య కుమారుడు రామానుజన్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఆర్థిక సమస్యలతో యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల: ఆర్థిక సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకొని తనువు చాలించాడు. జీడిమెట్ల ఎస్సై నాయుడు తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాలకు చెందిన కృష్ణస్వామి (23) కొన్నేళ్ల క్రితం ఉపాధికి హైదరాబాద్ చింతల్‌కు వలస వెళ్లాడు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో పని చేస్తూ.. అక్కడి శ్రీనివాసనగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కొన్నాళ్లుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో మంగళవారం తాను ఉంటున్న ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఆరోగ్య ప్రశస్తి

విద్యార్థుల్లో లోపాల గుర్తింపునకు ప్రత్యేక యాప్

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, కంది, పరిగి, నర్సాపూర్

ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పం. ఇందులో భాగంగా పాఠశాల్లో చదువుతున్న పిల్లల్లో ఏమైనా లోపాలు ఉన్నాయా అని గుర్తించేందుకు సరికొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. బాధితులకు వైద్యం అందించాలన్నలక్ష్యంతో ప్రశస్తి యాప్‌ను విద్యాశాఖ రూపొందించింది. ఉపాధ్యాయులే నేరుగా పిల్లలను పరిశీలించి వారిలో ఉన్న లోపాలను అందులో నమోదు చేయనున్నారు. వాటిని పరిశీలించి ఉన్నతాధికారులు వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటారు.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో విద్యాశాఖ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర విభాగాల పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రశస్తి యాప్‌పై అవగాహన కల్పిస్తోంది. ముందుగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఉపాధ్యాయులు.. పేరు, సర్వీసు నంబరు, మొబైల్ ఐడీ, వరవాణి నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి. ఈ నెల 23న ప్రారంభమైన శిక్షణ 25 వరకు కొనసాగనుంది. విద్యార్థుల్లో ఏదైనా ఆరోగ్య సమస్య, వైకల్య లోపంతో బాధపడుతున్నట్లు గుర్తిస్తే వారికి మెరుగైన వైద్య సేవలు అందించి సాధారణంగా మార్చడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
సంగారెడ్డి	1,820	2,50,110
సిద్దిపేట	1,845	2,92,200
మెదక్	1,529	2,20,400
వికారాబాద్	1,623	2,39,200


ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న సీఎంవో

64 ప్రశ్నలకు..

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయ్యాక కార్యక్రమం అమలుచేస్తారు. దీన్ని రెండు దశలుగా విభజించారు. యాప్‌లో అడిగిన ప్రశ్నలకు ఉపాధ్యాయులు కొన్నింటిని పిల్లల నుంచి రాబడతారు. మరికొన్ని క్షుణ్నంగా పరిశీలించి నమోదు చేయాలి.

పార్ట్-1: ఈ నెల 26 నుంచి అక్టోబరు 26 వరకు కొనసాగుతుంది. యాప్‌లో ఉండే 64 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. బోధన సమయంలో అందరినీ పరిశీలించాలి. సరిగా మాట్లాడుతున్నారా, గమనిస్తున్నారా, చదువుతున్నారా, అవయవ లోపం, వినికిడి లోపం, నత్తిగా మాట్లాడటం, మనోవైకల్యం, అర్థం చేసుకుంటున్నారా.. ఇలాంటివి ఉంటాయి. ఏది ఉందో గమనించి నమోదు చేయాలి.

పార్ట్-2: అక్టోబర్ 27 నుంచి నవంబరు 14 వరకు దీన్ని కొనసాగిస్తారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించే ఉపాధ్యాయులు లోపం ఉన్న వారిని పరిశీలిస్తారు. లోపాన్ని గుర్తించి వైద్యులకు సిఫార్సు చేస్తారు. వైద్యుల పరిశీలించి చికిత్స అందిస్తారు.

పకడ్బందీగా అమలు

వెంకటేశం, సీఎంవో, సమగ్ర శిక్ష, సంగారెడ్డి

ప్రశస్తి యాప్‌ను పక్కాగా అమలు చేస్తాం. ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి వివరాలు పక్కాగా నమోదయ్యేలా చూస్తాం. నెల రోజుల పాటు ప్రతి విద్యార్థిని ఉపాధ్యాయులు బోధన చేస్తూ స్క్రీనింగ్ చేస్తారు.

చికెన్ ధరలు

ఫారంలో	125-00	డ్రెస్డ్	213-00
రిటైల్	147-00	స్కిన్‌లెస్	243-00

ఆటల్లో గెలుపోటములు సహజం: డీఈవో



నర్మెటలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

నంగునూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధి నర్మెట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలను ఎంఈవో దేశిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే వారి శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడలను స్నేహపూర్వక వాతావరణంలో ఆడి క్రీడాస్ఫూర్తిని చాటాలని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు నాగార్జున రెడ్డి, శ్రీనివాస్, వ్యాయామోపాధ్యాయులు రాజమౌళి, తడకంటి రాజు, తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడలకు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఎంఈవో ప్రభుదాస్, తోట కమలాకర్‌రెడ్డి, వ్యాయామోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న దారి కష్టాలు

వంతెన నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరు

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం:



ప్రతిపాదించిన స్థలం

హుస్నాబాద్ మండలం తోటపల్లి, పూసవేర్లపల్లి పల్లెల మధ్య ఉన్న కోనేటివాగుపై వంతెన లేక ప్రజలు అనేక ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. వారి సమస్యను గుర్తించిన ప్రభుత్వం వాగుపై వంతెన నిర్మాణానికి రూ.2.50కోట్లు మంజూరు చేసింది. తోటపల్లి, పూసవేర్లపల్లి మధ్య కోనేటివాగు ఉంది. అక్కడ 38 వరకు ఇళ్లు, 50 కుటుంబాలు ఉన్నాయి. దీంతో పాటు తోటపల్లికి చెందిన రైతుల వ్యవసాయ భూములు, పశువుల పాకలు, గీత కార్మికుల జీవనాధారమైన తాటిచెట్లు వాగు అవల ఉన్నాయి.

మంత్రి హామీతో నెరవేరిన కల

వర్షాకాలంలో ఈ వాగు పొంగితే పూసవేర్లపల్లికి బయటి ప్రపంచంతో సంబంధం తెగిపోతుంది. వారు అక్కడి నుంచి రావాలంటే అక్కన్నపేట మండలం జనగామ మీదుగా వెళ్లాలి. తోటపల్లి వాసులది అదే పరిస్థితి. గ్రామానికి చెందిన 150 మంది రైతులకు చెందిన సుమారు 600 ఎకరాల వ్యవసాయ భూములు వాగు అవల ఉన్నాయి. వాగు పొంగితే పొలాల వద్దకు వెళ్లి పశువులకు మేత, నీరు అందించలేని దుస్థితి నెలకొంది. ఎన్నో ఏళ్లుగా వాగుపై వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను గుర్తించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది

– పంపర సంపత్, తోటపల్లి

మాకు వాగు అవలి వైపు వ్యవసాయ భూమి ఉంది. వాగు పొంగితే రెండు, మూడు రోజులు వెళ్లలేని పరిస్థితి. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో సంతోషంగా ఉంది.

మా ఇబ్బందులు తీరనున్నాయి

– గీకురు చిరంజీవి, పూసవేర్లపల్లి

చాలా మంది ఇళ్లను వదిలేసి తోటపల్లి, హుస్నాబాద్‌కు వెళ్లి అక్కడే ఉంటున్నారు. ప్రస్తుతం 22 ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. సరైన రోడ్డు లేక అంబులెన్స్ వచ్చే వీలులేదు.

అంచనాలు రూపొందిస్తున్నాం

– మహేశ్వర్, పంచాయతీరాజ్ డీఈ

వాగుపై వంతెన నిర్మించే ప్రతిపాదిత స్థలాన్ని మంగళవారం గ్రామస్థులతో కలిసి పరిశీలించాం. మంజూరైన నిధులతో 1.50 కోట్లతో వంతెన, ఒక కి.మీ. తారు రోడ్డు నిర్మించనున్నాం. ఇప్పటికే సర్వే చేశాం. అవసరమైన అంచనాలు తయారు చేస్తున్నాం.

న్యూస్‌టుడే, బెజ్జంకి

? మండల కేంద్రంలోని ఎనిమిదో వార్డులో నల్లా నీరు సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. నీటి సరఫరాను మెరుగుపరచాలి. -జగన్, కాలనీవాసి

✔ నల్లాల ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. - ప్రణీత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

? మండల కేంద్రంలో బీసీ బాలుర వసతిగృహం సమీపంలోని పశువుల నీటితొట్టికి గోడలు ధ్వంసమయ్యాయి. -రాజయ్య, రైతు

✔ పరిశీలించి మరమ్మతులు పనులు చేపడతాం. - ప్రణీత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం: ఎమ్మెల్సీ

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని ఎమ్మెల్సీ డా. యాదవరెడ్డి అన్నారు. మంగళవారం కొండపాక మండలానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఆయన తన నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో భారాస కొండపాక మండలాధ్యక్షుడు నూనెకుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న డా.యాదవరెడ్డి

భాషల పరిరక్షణే పండిత పరిషత్ లక్ష్యం

చేర్యాల: భాషలను పరిరక్షించడం, వాటిని బోధించే ఉపాధ్యాయుల హక్కులను కాపాడడమే రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ లక్ష్యమని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ అన్నారు. మండలంలోని కడవేర్గు ఉన్నత పాఠశాలలో మంగళవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిషత్ పోరాట ఫలితంగానే రాష్ట్రంలో 8వేలకు పైగా భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి దక్కిందన్నారు. సంఘం ప్రతినిధులు నవీన్, కనకలింగం, ధర్మారెడ్డి, కరుణాకర్, రఘుపతి, శ్రీనివాస్, మాధవి, శారద, కవిత తదితరులు పాల్గొన్నారు.

'కాటమయ్య రక్షణ కవచం' వినియోగంపై శిక్షణ



పందిల్లలో అవగాహన కల్పిస్తున్న ఆబ్కారీ అధికారులు

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుస్నాబాద్ మండలంలోని పందిల్ల తాటి వనంలో 'కాటమయ్య రక్షణ కవచం' సేఫ్టీ మోకులపై మంగళవారం గీత కార్మికులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బీసీ సంక్షేమ, ఆబ్కారీ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణకు నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన గీత కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి సేఫ్టీ మోకులతో తాటిచెట్టు ఎక్కే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గౌడ సంఘం నియోజకవర్గ ఛైర్మన్ మార్క అనిల్‌గౌడ్, ఎక్సైజ్ ఎస్‌ఐ రవి, కానిస్టేబుల్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

భాజపా గీత సెల్ జిల్లా కో-కన్వీనర్‌గా ఆశా గౌడ్

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: భాజపా గీత సెల్ జిల్లా కో-కన్వీనర్‌గా మిరుదొడ్డి మల్లుపల్లికి చెందిన అన్నెబోయిన ఆశాగౌడ్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎంపీ రఘునందన్‌రావు, గీత సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పటేల్ వెంకటేష్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వరంగల్ రైతు డిక్లరేషన్ అమలు చేయండి

సిద్దిపేట అర్బన్: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన వరంగల్ రైతు డిక్లరేషన్ హామీని షరతులు లేకుండా అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు జశ్వంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రైతు డిక్లరేషన్ అమలు చేయాలని సంఘం ఆధ్వర్యంలో బుధవారం చలో సిద్దిపేట కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలియజేశారు.

సాగునీటి సంరక్షణపై ముగిసిన శిక్షణ



ఏఈవోలతో జిల్లా వ్యవసాయాధికారిణి రాధిక

కొండపాక గ్రామీణం: నీటి సంరక్షణ, సాగునీటి యాజమాన్య పద్ధతులపై జిల్లాలోని ఏఈవోలకు రెండ్రోజుల పాటు వాలంతరి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారిణి రాధిక హాజరై శిక్షణ పొందిన ఏఈవోలకు ధ్రువపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. నేల, నీటి సంరక్షణ విధానాలు, బిందు, తుంపర సేద్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అన్నదాతలకు వివరించాలన్నారు. వాలంతరి సంస్థ అధికారిణులు సునీత, అన్నపూర్ణ, ఏడీఏ బాబునాయక్, ఏవో గోవిందరాజు తదితరులు ఉన్నారు.

బెజ్జంకి, వర్గల్: బెజ్జంకి మండలంలోని గాగిళ్లాపూర్‌లో పంటల నమోదు ప్రక్రియను డీఏవో రాధిక పరిశీలించారు. వర్గల్ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలు, గోదాములను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

చేర్యాల(మద్దూరు): వర్షాలతో వరిలో ఎండాకు తెగులు ఎక్కువగా ఆశిస్తుందని మద్దూరు ఏవో రామకృష్ణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పంటలను పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా

హుస్నాబాద్: హుస్నాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఎస్పీ నాయకులు మంగళవారం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రస్టు సేవలు అభినందనీయం

చేర్యాల: సామాజిక సేవ, మహిళా సాధికారతకు కృషి చేస్తున్న 'పాశికంటి లక్ష్మమ్మ- రాందాసు ట్రస్టు' సేవలు అభినందనీయమని మహిళా కమిషన్ విశ్రాంత డైరెక్టర్ శారద అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని కొత్తదొమ్మాట పాఠశాలలో 60మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. ట్రస్టు ప్రతినిధులు తదితరులున్నారు.

ఎమ్మెల్యే ఇంటిపై దాడి సరికాదు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం నేర రాజకీయాలను ప్రోత్సహిస్తుందని భారాసవి నియోజకవర్గ అధ్యక్షుడు పయ్యావుల శ్యామ్‌యాదవ్ మంగళవారం సిద్దిపేటలో విమర్శించారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయటం హేయమైన చర్య అన్నారు.

మిరుదొడ్డి: కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఇంటిపై రాళ్లతో దాడి చేయడం సరికాదని భారాస రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట కమలాకర్ రెడ్డి మిరుదొడ్డిలో పేర్కొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన వొడితల



హుస్నాబాద్: రానున్న శాసనమండలి ఎన్నికలకు నియోజకవర్గంలో ఎక్కువమంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించి, పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సూచించినట్లు మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

హుండీ ఆదాయం రూ.2.04లక్షలు

బెజ్జంకి: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించినట్లు ఈవో విశ్వనాథశర్మ తెలిపారు. ఆలయ, పంచాయతీ సిబ్బంది, సేవా సమితి సభ్యుల సమక్షంలో హుండీని లెక్కించగా రూ.2.04 లక్షలు సమకూరినట్లు తెలిపారు. ఆ మొత్తాన్ని యూనియన్ బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు పేర్కొన్నారు. ప్రధాన అర్చకుడు మధుసూదనాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కష్టపడిన వారికి గుర్తింపు'

సిద్దిపేట టౌన్: టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూజల గోపీకృష్ణ హైదరాబాద్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. సిద్దిపేట నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని,కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు.

వైద్య పరీక్షల నిర్వహణ

హుస్నాబాద్ గ్రామీణం: హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, సుఖవ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారి సదాకృష్ణ, ఐసీటీసీ కౌన్సిలర్ తిరుపతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జగదేవపూర్: జగదేవపూర్ ప్రభుత్వాస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో యాదగిరి, వైద్య సిబ్బంది, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వయోవృద్ధుల వారోత్సవాలు

సిద్దిపేట టౌన్: అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని బుధవారం నుంచి అక్టోబర్ 1 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి శారద తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరు మనుచౌదరి వారోత్సవాలకు సంబంధించి గోడపత్రికను విడుదల చేస్తారన్నారు. అక్టోబర్ 1న ముగింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు.

విచారణలో జాప్యం.. గ్రామస్థుల ఆందోళన

మిరుదొడ్డి: గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేసిన యువకులను విచారించడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ తొగుట మండలం గుడికందుల గ్రామస్థులు మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వారు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మద్యం సీసాలతో ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రజలను భయాందోళనకు గురిచేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న గ్రామస్థులు మిరుదొడ్డి ఠాణాలో ఫిర్యాదు చేశారు. విచారణలో ఎస్ఐ జాప్యం చేస్తున్నారంటూ ఠాణా ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట ఏసీపీ మధు ఘటనా స్థలికి చేరుకొని.. క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

రహదారిపై పడిన చెట్ల తొలగింపు



విరిగిపడిన చెట్టును స్థానికుల సాయంతో తొలగిస్తున్న సీఐ శ్రీను, ఎస్సై నీరేశ్

చేర్యాల: బలమైన ఈదురు గాలులకు మంగళవారం చేర్యాల నుంచి కడవేర్గు వెళ్లే దారిలో రోడ్డుపై చెట్లు విరిగి పడ్డాయి. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న సీఐ ఎల్.శ్రీను, ఎస్సై నీరేశ్ సిబ్బందితో కలిసి స్థానికుల సాయంతో వాటిని తొలగించి ప్రయాణానికి అనుకూలంగా చేశారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు మంగళవారం జిల్లా సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడిషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. గత కొన్ని రోజుల కిందట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, నర్సాపూర్, రంగధాంపల్లి చౌరస్తాలు, మెదక్ రోడ్, వేములవాడ కమాన్ వద్ద ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా 36 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి మొత్తంగా రూ.43,500 జరిమానా విధించారు.

వ్యాన్ ఢీకొని ఒకరికి గాయాలు

కొండపాక గ్రామీణం: రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని వ్యాన్ ఢీకొట్టడంతో ఒకరికి గాయాలైన ఘటన కొండపాక మండలం దుద్దెడలో మంగళవారం చోటుచేసుకుంది. దుద్దెడ టోల్‌గేట్ అంబులెన్సు సిబ్బంది తెలిపిన వివరాలు.. దుద్దెడకి చెందిన సంపంగి మహేందర్ మధ్యాహ్నం గ్రామంలో రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతుండగా సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న వ్యాన్ డ్రైవర్ అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న టోల్‌గేట్ సిబ్బంది క్షతగాత్రుడికి ప్రథమచికిత్స అందిస్తూ అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

నాగోలు, న్యూస్‌టుడే: జనావాసాల మధ్య గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార గృహం నిర్వహిస్తుండగా.. పోలీసులు దాడిచేసిన ఘటన ఎల్బీనగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన రావిశెట్టి దయాకర్(35) వృత్తిరీత్యా ఆటోడ్రైవరు. మూడు నెలల క్రితం నగరానికి వచ్చి మన్సూరాబాద్ పరిధి హిమపురి కాలనీలో అద్దెకు దిగాడు. సులువుగా డబ్బు సంపాదించేందుకు వ్యభిచార గృహం నిర్వహించాలని పథకం వేశాడు. యువతులను రప్పించి ఇంట్లోనే వ్యభిచారం చేయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎల్బీనగర్ పోలీసులు సోమవారం సాయంత్రం దయాకర్‌తో పాటు ఉప్పల్‌కు చెందిన విటుడు సుదర్శన్(44)ను అరెస్టు చేశారు. ఓ యువతిని రక్షించి రెస్క్యూహోంకు తరలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంగునూరు, న్యూస్‌టుడే: అక్కెనపల్లి ఆదర్శ పాఠశాలలో గంటల ప్రతిపాదికన బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ జానయ్య తెలిపారు. పీజీటీ విభాగంలో జంతుశాస్త్రం, భౌతిక శాస్త్రం, వృక్షశాస్త్రం, పౌరశాస్త్రం, గణితం, టీజీటీ విభాగంలో సోషల్ స్టడీస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 26 లోపు పాఠశాలలో ధ్రువపత్రాలను అందజేయాలని సూచించారు.

వ్యర్థాలను తొలగించి.. శుభ్రతపై అవగాహన కల్పించి..



కొండపాకలో పాల్గొన్న డీపీవో దేవకిదేవి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మానవునికి ఆరోగ్యం ఎంత ముఖ్యమో.. పట్టణానికి పరిశుభ్రత అంతే ముఖ్యమని బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం కోమటిచెరువు కట్టపై ఉదయపు నడకకు వచ్చే వారితో కలిసి వ్యర్థాలను తొలగించారు. వాకర్స్‌తో కలిసి పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య పర్యవేక్షకులు వనిత, మాధవి, ఐటీసీ, వాబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సమీపంలోని పట్టణ ప్రకృతి వనాన్ని ఆయన పరిశీలించారు.

కొండపాక గ్రామీణం: కొండపాక మండల సమీకృత కార్యాలయం సమీపంలో డీపీవో దేవకిదేవి, ఎంపీడీవో వెంకటేశ్వర్లతో కలిసి స్వచ్ఛతా హీ సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కొండపాక జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో శ్రమదానం చేశారు. కొండపాక మండలంలో వాటర్‌మెన్‌లకు జరుగుతున్న శిక్షణకు హాజరైన డీపీవో ఇంటింటికీ క్రమం తప్పకుండా తాగునీరు సరఫరా చేయాలన్నారు.

చేర్యాల: వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని చేర్యాల మున్సిపల్ కమిషనరు సుంచు నాగేందర్, పురాధ్యక్షురాలు స్వరూపారాణి విద్యార్థినులకు సూచించారు. 'స్వచ్ఛతా హీ సేవా-2024' కార్యక్రమంలో భాగంగా స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం పట్టణంలో ర్యాలీ తీసి, ప్రతిజ్ఞ చేశారు. బల్దియా మేనేజరు ప్రభాకర్, సీనియర్ సహాయకుడు కృష్ణ, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాంగణాలు లేక.. ప్రయాణికుల అవస్థలు



కొండపాక మండలం వెలికట్ట క్రాస్‌రోడ్డు, కొమురవెల్లి కమాన్ వద్ద ప్రయాణ ప్రాంగణాలు లేక ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు, వాహనాల కోసం ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ రోడ్డు పక్కన నిరీక్షిస్తున్నారు. పలుమార్లు బస్టాండు నిర్మించాలని ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై సిద్దిపేట డిపో మేనేజరు సుఖేందర్‌రెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. వెలికట్ట క్రాస్ రోడ్డు, కొమురవెల్లి కమాన్ చౌరస్తాలలో బస్టాండ్లు నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కొండపాక గ్రామీణం

విద్యాశాఖకు మంత్రి లేకపోవడం బాధాకరం: భారాసవి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావొస్తున్నా విద్యాశాఖకు మంత్రి లేకపోవటం సిగ్గుచేటని భారాసవి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంకటి నవీన్‌గౌడ్ అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన భోజనం, దుస్తులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. భారాసవి నాయకులు రాకేశ్, రాములు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

26న సిద్దిపేటలో ఆత్మీయ సభ

సిద్దిపేట: జిల్లా ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాంను ఈనెల 26న సిద్దిపేటలో సత్కరించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు పెద్దిరాజు, విక్రంరెడ్డి, ప్రవీణ్ మంగళవారం తెలిపారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు తగదు

సిద్దిపేట, మిరుదొడ్డి, దుబ్బాక: ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతులు, ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు తీవ్రమవుతున్నాయని, ఉపాధ్యాయుల సర్దుబాటు పేరిట వెలువరించిన అసంబద్ధ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధరశర్మ, ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేటలో మంగళవారం వారు మాట్లాడారు. మిరుదొడ్డిలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి, దుబ్బాకలో టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అమ్మన నర్సింహారెడ్డి భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులతో కలిసి మాట్లాడారు.

సేవాభావం, క్రమశిక్షణతోనే గుర్తింపు



హుస్నాబాద్ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆకారంలో విద్యార్థుల మానవహారం

హుస్నాబాద్, న్యూస్‌టుడే: జిల్లాలో పలు చోట్ల ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. హుస్నాబాద్‌లో స్థానిక బాలుర జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ గంగాధర్ ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సేవాభావం, క్రమశిక్షణను పెంపొందించుకోవాలని కోరారు. తర్వాత విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆకారంలో మానవహారం నిర్మించారు. ప్రోగ్రాం అధికారి టి.రణధీర్‌కుమార్‌తో పాటు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ శోభాదేవి, ఎన్ఎస్ఎస్‌పీవో కరుణాకర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట టౌన్: సిద్దిపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పతక దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.జీవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డా.శ్యామ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సువర్ణాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.సునీత, కళాశాల వైస్ ప్రిన్సిపల్ అయోధ్యరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ గ్రామీణ: గజ్వేల్ పట్టణంలోని బాలుర, బాలికల విద్యాసౌధం ప్రాంగణంలోని డిగ్రీ కళాశాలల్లో జరిగిన ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకల్లో బాలుర కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గణపతి రావు పాల్గొని మాట్లాడారు.

మిరుదొడ్డి: మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ శారద, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి: బెజ్జంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దేవస్వామి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. సిద్దిపేటలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయురాలు గీతాదేవి, ట్రాఫిక్ ఎస్సై గోపాల్‌రెడ్డి, సిబ్బంది జగదీశ్వర్, అఖిల్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

రాయపోల్: ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయడానికి యువత ముందుకు రావాలని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. సోమవారం రాత్రి రాయపోల్ మండలం ఎల్కల్‌లో ఆజాద్ డిఫెన్స్ అకాడమీ-గజ్వేల్ ఆధ్వర్యంలో 'పదో తరగతి ఉత్తీర్ణులైతే ప్రభుత్వ ఉద్యోగం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బేగంపేట ఏఎస్ఐ అమృత్, తదితరులున్నారు.

గజ్వేల్ గ్రామీణ: గజ్వేల్ బాలికల విద్యాసౌధం ప్రాంగణంలోని డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై గజ్వేల్ సీఐ సైదా అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ కమల, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేటలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఎస్ఐ విజయభాస్కర్ సైబర్ నేరాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

చేర్యాల: మండలంలోని పోతిరెడ్డిపల్లి- పెద్దరాజుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై కొమురవెల్లి ఎస్సై రాజు అవగాహన కల్పించారు.